ప్రజాశక్తి
మంగళవారం 11 జులై 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

కదం తొక్కిన అంగన్‌వాడీలు

ఒంగోలులో నిరసనలో భాగంగా సోమవారం రాత్రి కలెక్టరేట్ వద్దే నిద్రపోతున్న అంగన్‌వాడీలు

- ప్రకాశం, బాపట్ల కలెక్టరేట్ల వద్ద 36 గంటల నిరసన ప్రారంభం
- పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పెండింగ్ సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీలు కదం తొక్కారు. ఐసిడిఎస్ బడ్జెట్ పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ అమలు చేయాలని, సంక్షేమ పథకాలు ఇవ్వాలని, అమ్మఒడి, యూనిఫారం ఇవ్వాలని, విధి నిర్వహణలో మరణించిన అంగన్‌వాడీ కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో ఒంగోలు, బాపట్ల కలెక్టరేట్ల వద్ద 36 గంటల నిరసన కార్యక్రమం చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి డిమాండ్లపై నినదించారు. ప్రకాశం జిల్లాలో అంగన్‌వాడీల నిరసనకు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి అయ్యపరెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.బాలకోటయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాలు రమాదేవి, డివై యఫ్ ఐ జిల్లా కార్యదర్శి కె.యఫ్.బాబు సంఘీభావం ప్రకటించారు. నిరసన కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు అకట్టుకున్నాయి. ఒంగోలు, బాపట్ల కలెక్టరేట్ల వద్దే నిరసన స్థలంలోనే శనివారం రాత్రి అంగన్‌వాడీలు నిద్రించారు. బాపట్లలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి అంగన్‌వాడీలకు సంఘీభావం ప్రకటించి.. వారితో పాటు అక్కడే నిద్రించారు. ▶ 8లో

బాపట్లలో కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ఒంగోలులో కలెక్టరేట్ వద్ద ఆందోళనలో పాల్గొన్న అంగన్‌వాడీలు

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ ▶ 8లో

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన నాగార్జున

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

'అమ్మ ఒడి'పై వీడని ఆందోళన

- 85 శాతం లబ్ధిదారులకే నగదు పడినట్లు గణాంకాలు
- అర్హత ఉందని చూపిస్తున్నా.. ఎక్కువమందికి తప్పని ఎదురుచూపులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అమ్మ ఒడి పథకానికి అర్హత ఉన్నా ఈ సారి ఎక్కువ మందికి రాలేదనే చర్చ సాగుతోంది. వీరంతా గత పది రోజులుగా బ్యాంకు ఖాతాలను చూసుకుంటూనే ఉన్నారు. ఏ రోజుకారోజు ఫోన్లలో తనిఖీ చేసుకుంటున్నారు. బ్యాలెన్సు చూశాక నిరుత్సాహపడుతున్నారు. ఖాతాల్లో జమ కాని లబ్ధిదారులందరిదీ ఇదే పరిస్థితి. అధికారులు చెప్పే గణాంకాలకు, జమలకూ పొంతన ఉండటం లేదు. సచివాలయ సిబ్బందినో లేక వాలంటీర్లనో కనుక్కుంటే ఈ నెల 10లోపు పడతాయని చెబుతున్నారు. పదో తేదీ కూడా ముగిసింది. వాస్తవంగా ఎంత మందికి డబ్బులు పడ్డాయి? ఎంత మందికి పడలేదనే సమాచారం కూడా జిల్లా యంత్రాంగం వద్ద లేదు. విద్యాశాఖ అధికారులు మాత్రం జిల్లాలో 85 శాతం మంది లబ్ధిదారులకు నగదు జమ చేసినట్లు చెబుతున్నారు. వివిధ కారణాల వల్ల 15 శాతం మందికి పడలేదని స్పష్టం చేస్తున్నారు. వివిధ కారణాలు అంటే ఏమిటనేదీ స్పస్టత లేదు. గతేడాది అదే విద్యార్థి తల్లి ఖాతాలో నగదు పడింది. ఈ ఏడాది వేయకపోవడానికి కారణం ఏమిటనేది తెలియడం లేదు. ఏదో రకంగా కోతలు పెట్టారు. అధికారులు చెప్పిన గణాంకాల మేరకు 15 శాతం మంది అర్హులకు అందలేదు. వాస్తవానికి ఈ లెక్క ఇంకా ఎక్కువగానే ఉన్నట్లు తెలుస్తోంది. 2020-21లో 2,82,080 మంది లబ్ధిదారులకు రూ.423.1 కోట్లు జమచేశారు. ఈ ఏడాదీ ఇంచుమించుగా ఇదే లెక్క ఉంది. అయితే 15 శాతం మందికి పడలేదంటున్నారు. 2.82 లక్షల మంది లబ్దిదారుల్లో 15 శాతం అంటే సుమారు 40వేల మందికిపైగా నగదు పడలేదని అంటున్నారు. ఈ సమయంలో పుస్తకాలు, ఫీజులకు ఉపయోగపడతాయని ఎదురుచూసిన తల్లులకు నిరాశే మిగిలింది.

ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి వల్లే..

- యర్రం పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికాకపోవడానికి అదే కారణం
- బాపట్ల జిల్లా అభివద్ధి మండలి సమావేశంలో చర్చకు పెడతా..
- ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి -మేదరమెట్ల

2008లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసిన యర్రం చిన పోలిరెడ్డి పథకం ఇప్పటికీ పూర్తి కాకపోవడానికి ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరే కారణమని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు విమర్శించారు. వచ్చే నెలలో జరగబోయే బాపట్ల జిల్లా అభివద్ధి మండలి సమావేశంలో ఈ పథకం నిర్మాణంపై చర్చకు పెడతానన్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించేలా తగిన చొరవ తీసుకుంటానని చెప్పారు. సోమవారం మండలంలోని రావినూతల గ్రామంలో రైతుసంఘం ఆధ్వర్యంలో యర్రం పోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలంటూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి బాబాయ్ వైవి.సుబ్బారెడ్డి తండ్రి పేరు ఉన్న ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కూడా ఎందుకు అలసత్వం జరుగుతుందో ఆలోచించాలన్నారు. సగానికి పైగా పనులు అలాగే నిలిచిపోయాయన్నారు. కాలువలు, పిల్ల కాలువలు పూర్తికాలేదన్నారు. ఇంకా పూర్తిగా ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి కావాలంటే సుమారు 100 కోట్ల రూపాయలు అవసరమవుతుందని తెలిపారు. ఇటువంటి పరిస్థితులలో ఈ ప్రాంతపు రైతులంతా కలిసి ఈ ప్రాజెక్టు పూర్తి కోసం ప్రభుత్వంపై ఒత్తిడి చేయాలని, తద్వారా 20 వేల ఎకరాల భూమి సాగులోకి వస్తుందనే కలను నెరవేర్చుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ▶ 2లో

ప్రభుత్వాల నిర్లక్ష్యవైఖరి వల్లే..

(మొదటిపేజీ తరువాయి)

2013 యాక్ట్ ప్రకారం ఏ రైతు అయితే ప్రజల ప్రయోజనాల దష్ట్యా భూమిని ఇచ్చాడో ఆ రైతుకు ఆ భూమి విలువ మీద నాలుగు వంతులు విలువను కలిపి ఇవ్వాలని యాక్ట్ చెబుతోందన్నారు. భూమి ఇచ్చిన రైతు సంతోషంగా ఉండాలని అన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రభుత్వాన్ని, ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్మాణం కోసం కావలసినంత బడ్జెట్‌ను ప్రభుత్వంతో మంజూరు చేయించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు ఈ ప్రాంత రైతులంతా కలిసి ఐక్యతతో ముందుకు రావాలని సూచించారు. సదస్సు అనంతరం ప్రాజెక్టు నిర్మాణ సాధన కోసం 12 మంది సభ్యులతో కూడిన ఎత్తిపోతల పోరాట సాధన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రాయిని వినోద్‌బాబు, రైతుసంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షులు పెంట్యాల హనుమంతరావు, నాగులుప్పలపాడు మండల బాధ్యులు శ్రీకాంత్, కందిమళ్ల రామకోటేశ్వరరావు, రైతుసంఘం మండల బాధ్యులు కొల్లా సుబ్బారావు, నాతాని హనుమంతరావు పాల్గొన్నారు.

రూ.10 వేల సాగు సాయం ఇవ్వాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

తెలంగాణ ప్రభుత్వ తరహాలో మన రాష్ట్రంలోనూ ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దేవండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రంలో ప్రతి రైతు రూ.2.45 లక్షల రుణ భారంతో ఉన్నారన్నారు. ఆత్మహత్యలలో మన రాష్ట్రం మూడో స్థానంలో ఉందన్నారు. కనీస మద్దతు ధరలకు కూడా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోలేకపోతున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు టిసిహెచ్. చెన్నయ్య, కెవి. కృష్ణ గౌడ్, సాంబ శివరావు, విశ్వరూపాచారి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని ఘడియాపూడి సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టిజెఆర్.సుధాకర్ బాబు హాజరై లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి రామాంజనేయులు, మండల నాయకులు మొరబోయిన సంజీవరావు, గార్లపాడు సర్పంచి గంగిరెడ్డి ఎంపిటిసిలు ప్రభాకరరావు, వాకా కోటిరెడ్డి, దేవదాసు, అప్పారావు, జెసిఎస్ కన్వీనర్ బత్తుల శ్రీనివాసరావు, తహశీల్దార్ రజనీకుమారి, ఇఒపిఆర్‌డి సుబ్బారావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ. 4,21,963

ప్రజాశక్తి- సిఎస్ పురం రూరల్

మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయానికి ఆదివారం రూ. 4,21,963 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నర్రా నారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. దర్శనం టికెట్లు అమ్మకం ద్వారా రూ 1,19,060, స్వామివారి లడ్డూ ప్రసాదం అమ్మకం ద్వారా రూ.56,360, స్వామివారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు దాతల విరాళాలు రూ.1,27,002, మహా ప్రాకారం నిర్మాణానికి దాతలు విరాళాలు రూ. 1,19,541 వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. మహాప్రాకార నిర్మాణానికి నెల్లూరు జిల్లా, గుడ్లూరు మండలం, దప్పలంపాడు గ్రామానికి చెందిన గుత్తా ప్రభాకర్ నాయుడు,అర్చన దంపతులు రూ.1,09,525 విరాళంగా అందజేసినట్లు ఆలయ ఇఒ నారాయణరెడ్డి తెలిపారు.

అక్రమంగా గ్రానైట్ తరలింపు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-పొన్నలూరు

ఉళ్లపాలెం- వేములపాడు (ఒవి) రోడ్డు విస్తరణ పనులకు గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులను ఓ ప్రయివేటు సంస్థ నిర్వహిస్తోంది. రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్‌ను పొన్నలూరు మండలం చెన్నుపాడు రెవెన్యూ పరిధిలోని పశువుల పోరంబోకు స్థలం నుంచి అక్రమంగా తరలిస్తున్నారు. కాంట్రాక్టర్ సంబంధించిన జెసిబి ద్వారా పెద్దపెద్ద గోతులు తవ్వి గ్రావెల్‌ను తరలిస్తున్నాడు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన గ్రావెల్‌ను తరలించడానికి రెవెన్యూ, భూగర్భశాఖ అధికారుల నుంచి అనుమతులు పొందాలి. క్యూబిక్ మీటర్‌కు నిర్ధేశించిన నగదును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇక్కడ ఎలాంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వాని నగదు చెల్లించకుండా వందలాది లారీల మట్టిని తరలిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారు.

గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లు

గ్రావెల్ తవ్వకాలను నిలుపుదల చేశాం : తహశీల్దారు

అక్రమ గ్రావెల్ తరలింపు గురించి తహశీల్దారు శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా తాము ఎవరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. అక్రమ తవ్వకాలను నిలిపివేయాలని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విఆర్‌ఒలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. తహశీల్దారు ఆదేశాల మేరకు గ్రావెల్ తరలింపును అధికారులు సోమవారం నిలుపుదల చేశారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కనిగిరి

వాగు పోరంబోకు భూమిని ఆక్రమించి విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పిసి. కేశవరావు ఆధ్వర్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని సూరాపాపిరెడ్డి నగర్ సమీపంలోని 894 సర్వేనెంలోని 8.50 ఎకరాల వాగుపోరం బోకు భూమిని మార్కెట్ యార్డులో పనిచేసే బెంజిమెన్ అతని సోదరులు బి రూబెన్,కోటేశ్వరరావు ఆక్రమించి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ ,మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారన్నారని తెలిపారు. వారిపై భూకబ్జాకేసు నమోదు చేయాలని కోరారు. 895 సర్వేనెంలో పేదలకు ఇచ్చిన పట్టాల లబ్ధిదారులు క్షేత్రస్థాయిలో నివసిస్తున్నారోలేదో సర్వేచేసి లేని వారి పట్టాలు రద్దు చేయాలని కోరారు.

అక్రమ వెంచర్లు తొలగించాలి

అసైన్‌మెంట్ భూముల్లో వేసిన వెంచర్లను తొలగించాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకుడు పివి.శేషయ్య, డిహెచ్‌పిఎస్ నాయకులు పి.తిరుపతిరావు,రాజు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈయ సందర్భంగా వారు మాట్లాడుతూ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై, నకిలీపట్టాలు, ఫోర్జరీ సంతకాలతో మోసం చేస్తున్నవారిపై, అందుకు సహకరిస్తున్న వారిపై చర్యలు చేపట్టాలని శేషయ్య కోరారు.

పరిశ్రమలలో భద్రతా చర్యలు చేపట్టాలి

కలెక్టర్‌కు సిఐటియు వినతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోని ఫ్యాక్టరీలు, పరిశ్రమలలో భద్రతా చర్యలు చేపట్టాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కలెక్టర్ దినేష్ కుమార్‌ను సోమవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ ఇటీవల మున్నంగి సీఫుడ్స్ లో అమ్మోనియం లీక్‌తో 16 మంది ఒడిశా మహిళలు తీవ్రమైన జ్వరాలు, ఒళ్ళు నొప్పులతో ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో చేరా రన్నారు. ప్రమాదం తప్పటంతో అధికారులందరూ అమ్మోనియం లీక్ కాలేదని ప్రకటించారన్నారు. ఇటీవల గ్రానైట్ పరిశ్రమలు, సీఫుడ్స్ పరిశ్రమలు, పిటిపి ,పెరల్స్ డిస్టరీ ఇలా పారిశ్రామిక ఫ్యాక్టరీలు, పరిశ్రమల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పరిశ్రామిక ఫ్యాక్టరీల్లో పరిశ్రమల్లో భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోల్డ్ స్టోరేజ్, బయట వెహికల్స్‌లో వస్తున్న మహిళలు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదానికి గురై అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు పరిశ్రమలను అప్పుడప్పుడు తనిఖీ చేయాలన్నారు. భద్రతా చర్యలు చేపట్టకపోతే తీవ్రమైన నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. వెంటనే అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేసుపోగు మోజెస్ పాల్గొన్నారు.

శ్రేష్ఠ ఆలిండియా ప్రవేశ పరీక్షలో

ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శ్రేష్ఠ ఆలిండియా ప్రవేశ పరీక్షలో యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. ఆల్ ఇండియా స్థాయిలో 600, 657, 782, 883, 1,556 ర్యాంకులు కైవసం చేసుకున్నారు. 8వ తరగతి విద్యార్థిని షేక్ రేష్మ ఆల్ ఇండియా స్థాయిలో 600 ర్యాంకు, ప్రణయ్‌రాజ్ 657వ ర్యాంకు, ఏసుబాబు 782వ ర్యాంకును, చార్లెస్ వెస్లీ 883వ ర్యాంకు సాధించారు. పదవ తరగతి విద్యార్థి చరణ్ తేజ ఆల్ ఇండియా స్థాయిలో 1,556 ర్యాంకు సాధించాడు. ర్యాంకులు సాధించిన విద్యార్థులకు హైదరాబాదులోని హికింపేట లోనున్న సిఆర్‌పిఎఫ్ కాలేజీలో నాలుగేళ్ల పాటు రూ. 4,70,000 ఖర్చుతో ఇంటర్మీడియట్ వరకు కేంద్రం ప్రభుతం విద్యనందిస్తుంది. ఈ పాఠశాలకు చెందిన హనీ తేజ, గణేష్ 2022-23లో ఆల్ ఇండియా 203వ, 207వ ర్యాంకులను సాధించారు.ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయుడు ఎంవి. భాస్కర్‌ను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.రమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాలంటీర్ల నిరసన

పెద్దదోర్నాల : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నటరాజ్ సెంటర్‌లో పవన్ కళ్యాణ్ చిత్రపటానికి చెప్పుల దండ వేశారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో పవన్ కళ్యాణ్‌పై ఫిర్యాదు చేశాడు. కార్యక్రమంలో మండల పరిధిలోని వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో అశోక్‌రెడ్డి

కంభం రూరల్ : కంభం పట్టణానికి చెందిన టిడిపి నాయకుడు సయ్యద్ నూరుల్లా ఖాద్రీ కుమారుడు హుస్సేన్ మొహిద్దీన్ ఖాద్రీ నిఖా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన వలీమా కార్యక్రమంలో టిడిపి గిద్దలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ఖాద్రీని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందితో సమీక్ష

కనిగిరి : కనిగిరి మండల పరిషత్ కార్యాలయంలో డిఆర్‌డిఎ పీడీ టి. రవికుమార్ వెలుగు సిబ్బందితో సోమవారం సమీక్షా సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సక్రమంగా అమలు చేయాల న్నారు. రుణాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణాలు తిరిగి బ్యాంకులకు చెల్లించేలా చూడాలని సూచించారు. రికవరిలో వెనుకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎసి కళ్యాణ్, డిపిఎంలు నరసింహారావు, ప్రసాద్ రావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశం వాయిదా

పొన్నలూరు : మండల పరిధిలోని జడ్‌మేకపాడు గ్రామంలో గ్రామసభకు వార్డు సభ్యులు దుమ్మా కొట్టడంతో సమా వేశాన్ని వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యం సోమవారం తెలిపారు. గతంలోనూ వార్డు మెంబర్లు రెండు సార్లు సమావేశానికి హాజరు కాలేదు. మూడు సారి కూడా వార్డు సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడం చర్చకు దారి తీస్తోంది.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,ఒంగోలు

EA No : 329/2022
EP No : 110/2011
OS No : 1235/2006

నల్లపురెడ్డి సుబ్బారెడ్డి ..... డిక్రీహోల్డర్/పిటిషనర్ వర్సెస్
కొల్లం లక్ష్మీదుర్గ ...జడ్జిమెంట్‌డేటార్/ రెస్పాండెంట్‌ టు
కొల్లం లక్ష్మీదుర్గ, తండ్రి లక్ష్మయ్య
డోర్ నెంబర్ 51-1-128, వయస్సు 68 సం,
కబాడీపాలెం, ఒంగోలు ప్రకాశం జిల్లా

పై నెంబర్ గల ఈపిలోని మరియు EA : 329/2022 నందు పిటిషనర్ పిటిషన్ దాఖలు చేయగా పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం ఎన్ని సార్లు మీకు నోటీసులు పంపినప్పటికీ తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ఆర్డర్ వేసి ఉన్నారు తేదీ 25-07-2023న ఉదయం 10:30కి మీరు స్వయంగా గాని మీ తరపున వకీలు గారిగాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపగలరు లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ 25.07.2023
ఒంగోలు
తేది : 10.07.2023

ఇట్లు
కోలా శివప్రసాద్
అడ్వకేట్,ఒంగోలు

మోటారు బైకును ఢీకొన్న లారీ

మహిళ మృతి ● బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన ● లారీ యజమాని నుంచి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

ప్రజాశక్తి-అద్దంకి

ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. అద్దంకి తిమ్మాయపాలెం రోడ్డులో జరిగిన ఈ ప్రమాదంలో ఆళ్ల స్వప్న(34) అనే మహిళ మృతిచెందగా ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం నూజిళ్లపల్లి గ్రామానికి చెందిన వందనరావు తన భార్య స్వప్నతో కలిసి పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో వారి కుమారుడి ఫీజు విషయాల గురించి మాట్లాడి ఇంటిలోకి కావలసిన నిత్యావసర సరుకులు తీసుకుని ఇంటికి వెళుతున్న సమయంలో ఇటుక తయారీకి ఉపయోగించే మట్టిని తరలించే లారీ ఢీకొట్టింది. ఢీకొట్టిన అనంతరం లారీ ప్రమాద స్థలం నుంచి అతివేగంతో ముందుకు దూసుకుపోవడంతో స్థానికులు వెంటపడి లారీని నిలిపివేశారు. ఘటనా స్థలాన్ని సిఐ ఆర్ ఉమేష్ పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదంలో మరణించిన మహిళ స్మిత

రోడ్డుపై టైరు కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న బంధువులు

టైర్లు తగలబెట్టి నిరసన..

మృతురాలు స్వప్న కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించి టైర్లు తగలబెట్టారు. ఈ క్రమంలో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమయంలో మృతురాలి బంధువు ఒకరు న్యాయం చేయాలంటూ పెట్రోల్ డబ్బా తీసుకొని ఒంటిపై పోసుకోబోయాడు. సిఐ ఉమేష్ మాట్లాడుతూ సమస్యను పరిష్కరిస్తానని, మీరంతా స్టేషన్‌కు వస్తే అక్కడ మాట్లాడుకుందామని బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు.

కానిస్టేబుల్ అత్యుత్సాహం

ఇటీవల బదిలీపై వచ్చిన ఓ కానిస్టేబుల్ ఘటనా స్థలంలో మృతురాలి బంధువులతోనూ, ఓ ప్రముఖ పత్రిక విలేకరితోనూ అనుచితంగా ప్రవర్తించారు. దుర్భాషలాడుతూ పాత్రికేయునివైతే ఏం చేస్తావు అని దురుసుగా వ్యవహరించారని సమాచారం. ఈ కానిస్టేబుల్ ప్రవర్తన అక్కడ చర్చనీయాంశమయ్యింది. ఇతడి వలన సమస్య మరింత పెరిగిందని అక్కడి ప్రజలు చర్చించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని తూర్పునాయుడుపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు అంబేద్కర్ నగర్‌కు చెందిన కంకణాల కోటేశ్వరరావు(53) ఈ ప్రమాదంలో మరణించాడు. వృత్తి రీత్యా బేల్దారి మేస్త్రి అయిన కోటేశ్వరరావు ఓ ఫంక్షన్ నిమిత్తం ఆదివారం రాత్రి తూర్పునాయుడుపాలెం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. గ్రామం నుంచి జాతీయ రహదారికి వచ్చిన క్రమంలో గుర్తుతెలియని వాహనం కోటేశ్వరరావు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్ బాషా, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి స్థానికుల ద్వారా వివరాలు సేకరించారు. మృతదేహానికి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి సోమవారం టంగుటూరులోని కుటుంబ సభ్యులకు స్వాధీనం చేశారు. సంఘటనపై ఎస్ఐ ఖాదర్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి: బూచేపల్లి

ప్రజాశక్తి-చీమకుర్తి

రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జిల్లాపరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తొర్రగుడిపాడులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని.. లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ 11 రకాల పత్రాలను మంజూరు చేసే అవకాశం ఉన్నందున ప్రజలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ యద్దనపూడి అంజలి, వైసిపి మండల నాయకులు చిన్నపరెడ్డి మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

పత్రాలను పంపిణీ చేస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ

మొబైల్ ఐ క్లినిక్ వ్యాన్ ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు

నగరంలోని సర్వనేత్రాలయ రెటీనా, కంటి హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మొబైల్ ఐ క్లినిక్ వ్యాన్‌ను రెటీనా స్పెషలిస్ట్ డాక్టర్ మానస, సర్జికల్ గ్రాస్టో డాక్టర్ ఉప్పలపాటి శ్రీనివాసులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ఈ మొబైల్ ఐ క్లినిక్ ద్వారా ప్రతి ఆదివారం జిల్లాలోని గ్రామాలకు వెళ్లి పేదలకు ఉచితంగా చికిత్స చేస్తామన్నారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో ఎఫ్ఏఐసిఐ పద్ధతిలో శుక్లం ఆపరేషన్ చేస్తామన్నారు. ముందుగా అడ్వాన్స్‌డ్ రెటీనా స్కాన్‌ను ప్రముఖ సీనియర్ వైద్యనిపుణులు డాక్టర్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

మొబైల్ వ్యాన్‌ను ప్రారంభిస్తున్న వైద్యులు

సౌదీ అరేబియా దీనార్ కరెన్సీ పేరుతో మోసం

- పొదిలిలో రూ.5 లక్షల నగదుతో పరారైన బీహార్ దంపతులు

- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-పొదిలి

సౌదీ అరేబియాకు చెందిన కరెన్సీ నోట్లు ఇస్తామని ఆశ చూపి, నమ్మించి మోసం చేసి స్త్రీ పురుషుల జంట (బీహార్‌కు చెందిన దంపతులుగా భావిస్తున్న హిందీ మాట్లాడే వ్యక్తులు) ఉదంతం వెలుగు చూసింది. ఈ సంఘటనలో బీహారీలు మోసం చేసి రూ.5 లక్షల నగదుతో పరారైన సంఘటన పొదిలి పట్టణంలో సంచలనం కలిగించింది. విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణంలోని విశ్వనాథపురం ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా శ్రీ కన్యా లాడ్జి లైన్‌లో మద్యం మాల్ట్ సమీపంలో జరిగిన ఈ సంఘటన పూర్వపరాలు ఇలా ఉన్నాయి. శనివారం సాయంత్రం మార్కాపురం ఆర్టీసి బస్టాండ్ దగ్గర షేక్ షబీనా అనే మహిళ షేక్ రెహమాన్ అనే వ్యక్తికి సౌదీకి చెందిన ఒక దీనార్ నోటు ఇచ్చింది. ఆ ఫారిన్ నోటును రెహమాన్ పొదిలికి చెందిన షేక్ ఖాశింవలికి ఇచ్చాడు. అది నకిలీనా అసలుదా అని తెల్సుకునేందుకు ఖాశిం ఆదివారం హైదరాబాద్ వెళ్లి నిర్ధారించుకున్నాడు. దీంతో తమ సోదరుడికి ఆ నోటు ఇచ్చిన మహిళను, ఆమె వెంట ఉన్న వ్యక్తిని వారు నమ్మి మరికొన్ని నోట్ల మార్పిడికి ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలోనే రూ.22 లక్షల విలువ గల 1300ల దీనార్ నోట్లు మార్చుకునే విధంగా మాట్లాడుకున్నారు. అందుకోసం సోమవారం స్థానిక ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీకన్య లాడ్జి సమీపంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటికే ఖాశింవలి సిద్ధం చేసుకున్న ఐదులక్షల నగదుతో వేచి ఉండగా దంపతులుగా భావిస్తున్న బీహారీలు వచ్చి ఒక ప్యాకెట్ ఇచ్చి నగదు తీసుకుని మోటార్ సైకిల్‌పై వెళ్లిపోయారు. బీహారీలు ఇచ్చిన ప్యాకెట్‌ను తెరిచి చూడగా అందులో చిత్తుకాగితాలు ఉండటంతో తాము మోసపోయామని గుర్తించారు. అప్పటికే దంపతులుగా భావిస్తున్న వారు మోటారు సైకిల్‌పై పరారైనట్లు తెలుసుకొని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వ్యవసాయాధికారికి వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలో పత్తి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక వ్యవసాయ అధికారికి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఏడాది ఎక్కువ మంది రైతులు పత్తి పంట సాగు చేశారని పేర్కొన్నారు. అయితే దిగుబడి ఎకరాకు ఐదు నుండి 6 కింటాళ్లు మాత్రమే వచ్చిందన్నారు. మండలంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు క్రిష్టిపాటి చిన్నపరెడ్డి, బెజవాడ శ్రీనివాసరావు, నాయకులు కుమ్మిత శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కంకణాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న పర్సు అందజేత

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

చీరాల నవాబుపేటకు చెందిన షేక్ ముబీన, బాజీ దంపతులు ఇంకొల్లు శుభకార్యానికి వస్తున్నారు. రెండు జతల బంగారు కమ్మలతో పాటు రూ.15 వేల నగదును పర్సులో పెట్టుకొని బస్సు దిగే క్రమంలో పర్సు పోగొట్టుకున్నారు. పోగొట్టుకున్న పర్సును ఓ వృద్ధురాలు ఆ పర్సును తీసుకొని అద్దంకి బస్సు ఎక్కి వెళ్లిపోయింది. బస్సు దిగిన బాధితులు పర్సు చూసుకొని పోయిందని బస్టాండ్‌లో కూర్చొని రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఇంకొల్లు కంట్రోలర్ షేక్ బాబు వివరాలు సేకరించి వెంటనే అద్దంకి బస్సు కండక్టర్‌తో వివరాలు చెప్పి సదరు వృద్ధురాలి నుంచి పర్సును తీసుకొని తిరిగి బాధితులకు అప్పగించారు. దీంతో బాధితులు కంట్రోలర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కంట్రోలర్ చర్యను పలువురు అభినందించారు.

అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు: ఎస్ఐ

ప్రజాశక్తి-చిన్నగంజాం

అక్రమంగా మద్యం అమ్మి జైలు పాలు కావొద్దని ఎస్ఐ కె సురేష్ అన్నారు. మండలంలోని కొత్తపాలేనికి చెందిన కోటిరెడ్డి తన షాప్ వద్ద మద్యం అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు రైడ్ చేయగా అక్రమ మద్యం లభించిందని అన్నారు. నిందితుని వద్ద 5 హైదరాబాద్ బ్లూరిజర్వ్ విస్కీ, 3 రాయల్ రైట్ గ్రిన్ విస్కీ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

గొట్టిపాటి వెంకటసుబ్బయ్యకు అంత్యక్రియలు

ప్రజాశక్తి-యద్దనపూడి

మాజీ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు సోదరుడు యద్దనపూడి మాజీ ఎంపీపీ గొట్టిపాటి వెంకట సుబ్బయ్య(72) ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు సోమవారం నాడు సాయంత్రం యద్దనపూడిలో ఘనంగా జరిగాయి. ఈయన అంత్యక్రియలకు అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవి, పర్చూరు వైసిపి నాయకులు గొట్టిపాటి భరత్‌లు హాజరయ్యి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమయాత్రలో పాల్గొన్నారు. ముందుగా పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జి కృష్ణమోహన్ కూడా వెంకటసుబ్బయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి, యద్దనపూడి, మార్టూరు, పర్చూరుకు చెందిన పలువురు నాయకులు, ఆయన అభిమానులు, బంధువులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, భరత్

మాకు రక్షణ కల్పించండి సారూ..

- పికెట్ వద్ద పోలీసులను పెంచండి

- గ్రీవెన్స్‌లో ఎస్పికి రామాపురం గ్రామస్తుల మొర

ప్రజాశక్తి-వేటపాలెం

మండలంలోని అక్కాయ్యపాలెం గ్రామ పంచాయతీ రామాపురంలో ఇటీవల వర్గ విభేదాలు భగ్గుమన్న సంగతి పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో సోమ వారం రామాపురం గ్రామానికి చెందిన కొంతమంది బాధితులు గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కలిసి తమకు రక్షణ కల్పించాలని మొరపెట్టుకొన్నారు. మే-31వ తేదీ తమ గ్రామంలో ఆవుల వెంకటేష్ అలియాస్ కొండలు వర్గం పథకం ప్రకారం తమవారిని తారతమ్యం లేకుండా చితక బాదారన్నారు. ఈ ఘర్షణలో అడ్డం వచ్చిన చీరాల రూరల్ సిఐ ఏ మల్లిఖార్జునతో పాటు హెడ్ కానిస్టేబుల్స్ మహీందర్ రెడ్డి, వీరాస్వామిలకు కూడా తీవ్రగాయాలయ్యాయి. ఇప్పటికి కొంతమంది పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నారు. మరి కొందరు బెయిల్‌పై వచ్చి తమ వర్గానికి చెందిన పదిమందికి తక్కువ కాకుండా చంపడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిందని, కాబట్టి తమ గ్రామంలో సిసి కెమెరాలు పెట్టి పికెట్ వద్ద పోలీసులను పెంచితేనే మేము కంటి నిండా నిద్రపోతామని రామాపురానికి చెందిన సున్నపు శ్రీను, సిహెచ్ నాగూరు, కాటంగారి వెంకటేశ్వర్లు, ఆవుల కొండలు వేడుకొన్నారు.

14న డిపిటిఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-అద్దంకి

ఆర్‌టిసి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 14వ తేదీన ఉదయం 10గంటలకు బాపట్ల జిల్లా ప్రజా రవాణా అధికారి (డిపిటిఒ) కార్యాలయం వద్ద స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం కుమార్, పి తరుపతిరెడ్డి తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ ధర్నా నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వర్క్ షాపుల ప్రైవేటీకరణను ఆపివేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, కార్మికులకు రావలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని, 1/2019 సర్క్యులర్‌ను విధిగా అమలు చేయాలని కోరుతూ ధర్నా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ధర్నాలో జిల్లాలోని ఎస్‌డబ్ల్యూఎఫ్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కుమార్, తిరుపతిరెడ్డి కోరారు.

రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-నిజాంపట్నం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని తహశీల్దార్ కె నెహ్రూబాబు అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నిజాంపట్నం వారి ఆధ్వర్యంలో నిజాంపట్నం ప్రభుత్వ వైద్యశాల చైర్మన్ నాయుడు వెంకటేశ్వరరావు సహకారంతో అందించిన నోట్ పుస్తకాలను సోమవారం నిజాంపట్నంలోని శివపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు తహశీల్దార్ కె నెహ్రూబాబు పంపిణీ చేసి మాట్లాడారు. పేదలకు, నిరాశ్రయులకు రెడ్‌క్రాస్ సొసైటీ వారు మరిన్ని సేవా, సహయ కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 శేషు గోపాలం, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ కె గౌరీ శంకర్, జాయింట్ సెక్రెటరీ బసవరాజు, జడ్పీ హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ పి శ్రీకాంత్, శివపురం పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ముజీబ్, కొల్లిపర శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు

హర్షిణి విద్యార్థుల ప్రతిభ

ప్రాంగణ ఎంపికల్లో 14 మందికి అవకాశం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్: హర్షిణి కళాశాలల్లో విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి రానున్న రోజుల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఉద్యోగం కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు ఆ విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్ అన్నారు. సోమవారం మార్టూరులోని కళాశాల ప్రాంగణంలో హైదరాబాద్, చెన్నైకి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రాంగణ ఎంపిక నిర్వహించారు. విప్రో, ఎన్‌సిఆర్ టెక్నాలస్, 3ఐ ఇన్ఫోటెక్ కంపెనీలు పాల్గొని కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థులను ఎంపిక చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ రవి కుమార్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా క్యాంపస్ ప్లేస్‌మెంట్ ద్వారా ఎంపికయిన 14 మంది విద్యార్థు లను హర్షిణి చైర్మన్ గోరంట్ల రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు అభినందించారు. అధ్యాపకులు జి లక్ష్మీనారాయణ, రమణాచార్యులు, బోసుబాబు, సురేష్, షేక్ నాగూర్‌వలి, టి సంధ్యారాణి పాల్గొన్నారు.

జగనన్న సురక్షలో సత్వరమే ధృవీకరణ పత్రాలు

ప్రజాశక్తి-చీరాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్షను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సురక్ష ద్వారా అర్హులైన లబ్ధిదారులకు సత్వరమే ధవీకరణ పత్రాలను అందిస్తున్నారని కౌన్సిలర్ సూరగాని లక్ష్మి అన్నారు. సోమవారం చీరాల పట్టణంలోని 5వ వార్డు గొల్లపాలెంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు నెల రోజుల కార్యక్రమంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నేరుగా ఇంటికే పంపిస్తున్న ఘనత వైసిపిదేనని అన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజరం శ్రీనివాసరావు, మున్సిపల్ డిఇ ఐసయ్య, కౌన్సిలర్లు అనిల్, గోలి స్వాతి, పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు: కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అంటువ్యాధులు పెరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాలో అన్ని సచివాలయాల పరిధిలో కాలువల్లో పూడిక తొలగించాలన్నారు. గ్రామాల్లో ఉన్న రక్షిత నీటి పథకాలను నిరంతరం శుభ్రం చేసుకోవాలన్నారు. జిల్లాలో డెంగ్యూ, మలేరియా వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో మొక్కలు నాటాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఈ

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

నెల 15వ తేదీ నుంచి గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అమలు చేస్తున్న టేక్ హెూమ్ రేషన్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలు గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమం అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మి శివ జ్యోతి, డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ అర్జున్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శంకర్ నాయక్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, పశు సంవర్ధక శాఖ జెడి హనుమంతరావు, పౌర సరఫరాల శాఖ డిఎస్‌ఒ విలియమ్స్, డిఎం శ్రీలక్ష్మీ, రవాణా శాఖ అధికారి ఏ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన నిర్వహిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ఏజెన్సీలను నమ్మి మోసపోవద్దు: ఎస్‌పి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కువైట్ వంటి ఇతర దేశాలకు వెళ్లి డబ్బు సంపాదించాలనే మోజుతో గుడ్డిగా ఏజన్సీలను నమ్మి మోసపోవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రజలకు సూచించారు. సోమవారం ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎస్పీ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిధిలోని ప్రజలు నేరుగా వచ్చి కలిసి వారి సమస్యలు గురించి ఎస్పీకి రాతపూర్వక అర్జీల రూపంలో తెలిపారు. ఈ స్పందన కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలు మరియు ఇతర సమస్యల గురించి 59 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులకు ప్రాముఖ్యతనిచ్చి సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రజలు కువైట్ వంటి ఇతరదేశలకు వెళ్లి డబ్బు సంపాదించాలనే మోజుతో గుడ్డిగా ఏజెన్సీలను నమ్మి మోసపోవద్దని తెలిపారు. ఎవరైనా జీవనోపాధి కోసం కువైట్ వంటి అరబ్బు దేశాలకు వలస వెళ్లేటప్పుడు ఏజన్సీల మాయలో పడి మోసపోకుండా సమగ్రంగా విచారించుకొని నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ప్రజలను మోసం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ స్పందన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి మహేష్, స్పందన సెల్ ఇన్‌స్పెక్టర్ వి మాలకొండయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సహకార సంఘాలను నవీకరించాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సహకార సంఘాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు నవీకరణ ప్రక్రియను అధికారులు చేపట్టాలని జిల్లా కలెక్టరు పి రంజిత్ బాషా ఆదేశించారు. జిల్లాలోని సహకార సంఘాల నమోదు, అభివృద్ధిపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం స్థానిక కలెక్టర్ ఛాంబర్లో సోమవారం జరిగింది. ప్రాథమిక సహకార సంఘాలు, మహిళ డెయిరీ సంఘాలు, మత్స్యకార సంఘాలు, మహిళా సమాఖ్యలు, బాపట్ల జిల్లాలో 662 సహకార సంఘాలు ఉన్నాయని కలెక్టరు తెలిపారు. సహకార సంఘాలన్నింటినీ నేషనల్ కో-ఆపరేటివ్ డేటాబేస్‌లోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో 11 మహిళ డెయిరీ సహకార సంఘాలు నడుస్తున్నాయని, వాటిని తక్షణమే నవీకరించాలని అన్నారు. పంచాయతీల పరిధి లో బహుళ ప్రయోజన ప్రాథమిక సహకార సంఘాలు 112 ఉన్నాయని, మరో 97 డెయిరీ సంఘాలను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకురావాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో 47 సంఘాల ద్వారా 54 మల్టీపర్పస్ గోదాములను నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే 96 కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా సేవలను విస్తృతం చేయాలన్నారు. సహకార సంఘాల ఆధీనంలో జన ఔషధి కేంద్రాలను నడపడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఆదేశాల మేరకు బాపట్ల జిల్లాలో 7 పెట్రోల్ బంకులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. వ్యవసాయ సీజన్లో 49 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను ప్రాథమిక సహకార సంఘాల ద్వారా విక్రయించాలని కలెక్టరు రంజిత్ బాషా చెప్పారు. మార్కెటింగ్ సొసైటీల సహకారంతో విక్రయాలకు సంసిద్ధం కావాలన్నారు. ధాన్యం, కంది, శనగలు, మొక్కజొన్న, పసుపు పంటలను రైతుల నుంచి ప్రాథమిక సహకార సంఘాలు కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముందస్తుగా సంఘాల పూర్తి వివరాలు కేంద్ర ప్రభుత్వ సర్వర్‌లో నిక్షిప్తం చేయాలని ఆయన పలు సూచనలు చేశారు. సమావేశంలో జిల్లా సహకార శాఖ అధికారి రామారావు, మత్స్యశాఖ అధికారి సురేష్, పశు సంవర్ధక శాఖ అధికారి హనుమంతరావు, పిడిసిసి బ్యాంక్ సిఇఓ వై ప్రకాష్, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరాచక పాలన అంతమే యువగళం లక్ష్యం

సంఘీభావ యాత్రలు జయప్రదం చేయాలి ● టిడిపి బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

అరాచక పాలనకు అంతం పలకటమే లక్ష్యంగా అశేష జనావళి అడుగులతో యువగళం ముందుకు సాగుతుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఈ నెల 11న యువనేత లోకేష్ యువ గళం పాదయాత్ర 2,000 కిలోమీటర్లకు చేరుకుంటున్న నేపథ్యంలో బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం వ్యాప్తంగా సంఘీభావ యాత్రలను విజయవంతం చేయాలని ఏలూరి పిలుపునిచ్చారు. ప్రజల కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ భవిష్యత్తుకు భరోసా ఇస్తూ యువనేత ముందుకు సాగుతున్నారన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోందన్నారు. 5కోట్ల మంది ప్రజల ఆశీస్సులతో జనగళమే యువగళమై సాగుతున్న ఈ యాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. వడివడిగా అడుగులు వేస్తూ.. లక్షలాది ప్రజల ఆశీస్సులు అందుకుంటూ 153 రోజుల్లోనే యువనేత లోకేష్ 50 శాతం లక్ష్యాన్ని అధిగమించారని అన్నారు. జన ప్రభంజనంతో, రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగుతున్న యువగళానికి ప్రజల నుంచి రోజురోజుకూ అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. జనసంద్రంగా

లోకేష్‌తో ఎమ్మెల్యే ఏలూరి (ఫైల్)

సాగుతున్న యువగళం యాత్ర అధికారపార్టీ పెద్దలకు కంటి మీద కునుకులేకుండా చేస్తుందని ఏలూరి అన్నారు. లక్షలాది ప్రజలను నేరుగా కలుస్తూ, అనుక్షణం ప్రజల్లో మమేకమవుతూ, కన్నీళ్లు తుడుస్తూ లోకేష్ చేస్తున్న పాదయాత్ర అన్ని వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తోందన్నారు. యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకు అధికార పార్టీ సకల ప్రయత్నాలు చేసినప్పటికీ ఉక్కు సంకల్పంతో సాగుతున్న యువగళం జైత్రయాత్రను అడ్డుకోవడం వారి తరం కాలేదన్నారు. 153 రోజుల యువగళం పాదయాత్రలో యువనేత లోకేష్ సుమారు 30 లక్షల మంది ప్రజలను నేరుగా కలుసుకుని, 53 అసెంబ్లీ నియోజకవర్గాలు, 135 మండలాలు, 1,297 గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగుతుందన్నారు. యువనేత పాదయాత్రలో వివిధ వర్గాల ప్రజల నుంచి 2,895 రాతపూర్వక వినతిపత్రాలు అందాయన్నారు. రచ్చబండ కార్యక్రమాలకు పల్లెప్రజల నుంచి అనూహ్య స్పందన లభించిందని తెలిపారు. యువగళం పాదయాత్ర రాయలసీమలో చరిత్ర సృష్టించిందని, గతంలో మరే నాయకుడు చేయని విధంగా రాయలసీమలో 124 రోజులపాటు 44 అసెంబ్లీ నియోజకర్గాల మీదుగా 1,587 కిమీ పాదయాత్ర చేసి లోకేష్ రికార్డు సృష్టించారని పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర చిత్తూరు జిల్లాలో సాగుతున్న తరుణంలో రాష్ట్రంలో 108 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో జరిగిన 3 ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుపార్టీ విజయదుందుభి మోగించడంతో అధికారపార్టీలో యువగళం గుబులు మొదలైందన్నారు. యువ నేత చేపట్టిన యాత్ర రాష్ట్ర చరిత్రలో ఓ నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతుందన్నారు. తెలుగుదేశం ప్రభంజనానికి యువగళం జనగళం కానుందన్నారు. సంఘీభావ యాత్రలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు.

విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులేరీ..!

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- టిసిలు కూడా ఇచ్చే నాధుడు లేక విద్యార్థుల అగచాట్లు
- ఇదీ పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల తీరు..

పాఠశాలకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అధికారులు, ప్రజా ప్రతినిధులు మారుమూల ప్రాంతం పట్ల సవతి తల్లి ప్రేమను చూపుతున్నారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. మరో పాఠశాలలో చేరేందుకు కనీసం టిసి ఇచ్చే నాధుడు కూడా లేకపోవడంతో విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. పాఠశాల ప్రారంభమైనా ఉపాధ్యాయులను నియమించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఎనిమిది మంది ఉపాధ్యా యులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఇతర ప్రాంతాల నుంచి కేవలం నలుగురు మాత్రమే ఈ పాఠశాలకు వచ్చారు.

పాఠశాలకు కనికరమేదీ..

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీర్చలేకపోయింది. జిల్లా సరిహద్దు ప్రాంతమైన పెద్ద దోర్నాల మండలంలో గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో ఉన్నారు. ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలలో చదివిస్తున్నారు. 1300 మంది విద్యార్థులు చదువుతున్న ఈ పాఠశాలలో 14 మంది మాత్రమే సబ్జెక్టు బోధించే ఉపాధ్యాయులు, ఇద్దరు పీడీలు ఉన్నారు. మారుమూల ప్రాంతమనే కారణంతో బదిలీలో ఈ పాఠశాలను ఎంపిక చేసుకునేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపటం లేదు.

నెరవేరని మంత్రి హామీ..

పెద్దదోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు 600 మందికి పైగా బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వారికి ప్రత్యేకంగా ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని దశాబ్దన్నర కాలంగా ప్రజాప్రతినిధులు, అధికారులను విద్యార్థినుల తల్లిదండ్రులు వేడు కొంటున్నారు. అయినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. నియోజకవర్గ ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పదవి చేపట్టడంతో తమ కోరిక నెరవేరుతుందని తల్లిదండ్రులు ఆశించారు. రెండేళ్ల క్రితం పాఠశాలకు మంత్రిగా వచ్చిన సురేష్ ఆ సమయంలో బాలికల ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అది నేటికీ కార్య రూపం దాల్చలేదు.

14 మందికి పరిమితం..

ఉపాధ్యాయుల బదిలీల్లో ఎనిమిది మంది ఇతర ప్రాంతాలకు వెళ్లారు. నలుగురు ఇక్కడికి వచ్చారు. గత ఏడాది 18 మంది సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండగా ఈ ఏడాది 14 మందికే పరిమితమైంది. గణితం బోధనకు నలుగురు ఉండగా సాంఘిక, సామాన్య, జీవ శాస్త్రం బోధనకు ఇద్దరు చొప్పున, తెలుగు, ఆంగ్లం, హిందీ బోధనకు ఒక్కొక్కరు మాత్రమే ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

టిసిలు ఇచ్చేవారు లేక అగచాట్లు..

పాఠశాలలో చదివిన విద్యార్థులు వేరే పాఠశాలలో చేరాలంటే టిసి కావాల్సిఉంది. పాఠశాలలో టిసిలు ఇచ్చే వారు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం ప్రజా ప్రతినిధులను తెలియజేసినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం

శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు, పెద్దదోర్నాల

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. ఉపాధ్యాయులను భర్తీ చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక అందజేశాం. మారుమూల ప్రాంతానికి ఉపాధ్యాయులు రావడానికి ఇష్టపడడం లేదు. ఈ పాఠశాల నుంచి ఎనిమిది మంది బదిలీపై వెళ్లినా కేవలం నలుగురు మాత్రమే వచ్చారు. దీంతో చాలా ఇబ్బందిగా ఉంది.

మైనార్టీలను దగా చేస్తున్న వైసిపి

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రోషన్ సందాని

ప్రజాశక్తి-వెలిగండ్ల

ముస్లిం మైనార్టీలను ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అన్ని విధాలుగా మోసం చేశారని టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి రోషన్ సంధాని ఆరోపించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు మజాహర్ అధ్యక్షత సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంధాని మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమానికి రూ.22వేల కోట్లు ఖర్చు చేశామంటూ అసత్యపు ప్రచారాలు చేసుకోవడం తగదన్నారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి మైనార్టీలను ఎదగనీయకుండా జగన్ చేస్తున్న యత్నాలను ఎండ గట్టాలన్నారు. విదేశీ విద్య, దుల్హాన్, రంజాన్ తోఫా తదితర పథకాలను రద్దు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ నిధులను ప్రక్కకు మళ్లించి ముస్లింలను అడుగడుగునా దగా చేస్తున్న వైసిపి ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్‌వలి, టిడిపి జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి సయ్యద్ సుభాని, వాలిచర్ల శ్రీను, కాజా సైరుద్దీన్, వెల్డింగ్ సిద్ధయ్య, నాసర్ మస్తాన్, టైలర్ నాసర్, షేక్ నన్నేమియా, మౌలానా ఆజాద్, మౌలాలి, వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వినోద్

మాట్లాడుతున్న వినోద్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లు, మంచినీరు, ఫ్యాన్లు, లాంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వినోద్ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వాల న్నారు. పశువుల దొడ్ల కంటే దారుణంగా హాస్టళ్లు మారాయన్నారు. సొంత భవనాలకు మరమ్మత్తులు చేయించాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న హాస్టల్ విద్యార్థుల మెస్, కాస్మొటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరారు. మార్కాపురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లేక విద్యార్థులు అర్ధాంతంగా చదువులు మానేస్తున్నారన్నాఉ. ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్, లోకేష్, జిల్లా నాయకులు హిదాయతుల్లా, శ్రీను, పోలయ్య పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయాలి : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు కోరారు. టిడిపి కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కనిగిరిలో నియోజక వర్గంలో త్వరలో యువగళం పాదయాత్ర, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎన్‌సి.మాలకొండయ్య, షేక్ అబ్దుల్లా, తులబండుల గురవయ్య, జగన్నాధం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. **పొన్నలూరు :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రను పొన్నలూరు మండలంలో జయప్రదం చేయాలని కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి పాలనలో ప్రజలు విసిగి పోయారని తెలిపారు. వైసిపిని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అనంతరం పాదయాత్ర సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సభా ప్రాంగంలో ఏర్పాట్లును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పొన్నలూరు, జరుగుమల్లి, టంగుటూరు మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు

విద్యార్థి వంశీ కృష్ణారెడ్డి నివాళి

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పోతిరెడ్డి వంశీ కృష్ణారెడ్డి కొద్ది రోజులుగా మైయోసైటిస్ వ్యాధితో బాధపడుతున్నాడు. హైదరాబాదులో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వంశీ కృష్ణారెడ్డి మృతదేహానికి స్వగ్రామంలో సోమవారం అంత్య క్రియలు నిర్వహించారు. మృతుడు గరక్‌పూర్‌లో ఐఐటి చదువు తున్నాడు. వంశీకృష్ణారెడ్డి మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, నగరపంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, గ్రామ మాజీ సర్పంచి గొర్రె సుబ్బారెడ్డి, మాజీ ఎంపిటిసి పోతిరెడ్డి అంజిరెడ్డి, నాయకులు అంబటి గోవిందరెడ్డి, అంజినాయుడు తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

డిఎస్‌పి కార్యాలయం ఎదుట నిరసన

ప్రజాశక్తి-దర్శి

కొనకనమిట్ల మండలం చినారికట్ల గ్రామానికి చెందిన రమ్య ఆత్మహత్యకు కారకులైన వారిని అరెస్టు చేయాలని దళిత సంఘాల నాయకులు ప్రేమ్‌కుమార్, కాలేబు డిమాండ్ చేశారు. దర్శి డిఎస్‌పి అశోక్‌వర్ధన్‌రెడ్డిని సోమవారం కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం డిఎస్‌పి కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్‌పి మల్లిక గర్గ్‌ను కలిసి రమ్య కేసుపై సమగ్ర విచారణ జరిపించాలని కోరినప్పటికీ న్యాయం జరగలేదన్నారు. ఈ కార్యక్రమంలో యోనా, మరియమ్మ, కుమారి, రవి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన షబ్బీర్

ప్రజాశక్తి-పొదిలి

టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ ను యువగళం పాదయాత్రలో పొదిలికి చెందిన టిడిపి పార్లమెంట్ లీగల్ సెల్ అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

గర్భిణులను పరీక్షిస్తున్న డాక్టర్ మానస

గర్భిణులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-మద్దిపాడు

విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయించుకొనేలా అవగాహన కల్పించాలని మద్దిపాడు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ మానస తెలిపారు. స్థానిక వైద్యశాలలో ప్రధానమంత్రి మాతత్వ సురక్షిత అభియాన్ కార్యక్రమం కింద 35 మంది గర్భిణులకు సోమవారం వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ ప్రతి స్త్రీ గర్భం దాల్చిన రోజు నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో తమ పేరును కచ్చితంగా నమోదు చేసుకోవాలన్నారు. డాక్టర్ విన్నీల చౌదరి మాట్లాడుతూ గర్భిణులు పోషకాహారం తీసుక ోవాలన్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే వెంటనే ఆస్పత్రికి రావాలని సూచించారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోఎంపిహెచ్‌ఎస్ పద్మావతి, నాగేశ్వరావు, బాలకోటయ్య, విలేజ్ హెల్త్ ఆఫీసర్స్ కీర్తిలక్ష్మి, కృప, స్టాప్ నర్సు రాణి, ఎల్‌టి సుశ్రిమిత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

ప్రజాశక్తి-మార్కాపురం

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మార్కాపురం- 10వ సచివాలయ పరిధిలోని 16, 17వ వార్డుల్లోని అరుణోదయ స్కూల్‌లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి వెళ్ళి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం రాష్ట్రంలోనే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్.అంజమ్మశ్రీనివాస్, 16వ వార్డు కౌన్సిలర్ దారివేముల హర్షితబాబి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ పత్తి రవిచంద్ర, మున్సిపల్ ఆర్ఓ రంగారావు, ఆర్ఐ నాయక్, సచివాలయాల కన్వీనర్, గహ సారథులు, సచివాలయం సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **నాగులుప్పలపాడు :** జగనన్న సురక్ష పథకం ద్వారా 11 రకాల పౌర సేవలు ఉచితంగా ప్రజల ఇంటివద్దకే అందిస్తున్నట్లు ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకర్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి సుపరిపాలనలో భాగంగా మన రాష్ట్రంలో ప్రతి ఇంటికి 11రకాల పౌరసేవలు ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నలమలపు అంజమ్మ, సర్పంచి చిన్నం సుజాత, ఎఎంసి చైర్మన్ మారెళ్ళ బంగారుబాబు, వైసిపి వాణిజ్యవిభాగం రాష్ట్రకార్యదర్శి నలమలపు కృష్ణారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ పి. శ్రీమన్నారాయణ, పులిచర్ల పరందామి రెడ్డి, చిన్నం సురేష్, కొమ్మూరి సుధాకర్, ఎంపిడిఒ జయమణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **పిసిపల్లి :** మండలం పరిధిలోని చింతగుంపల్లి గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్షా కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, శీలం సుదర్శనం, జడ్‌పిటిసి పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ పోలు జయరామిరెడ్డి, యూత్ అధ్యక్షుడు మేకల మాళ్యాద్రి, రైతు సంఘం అధ్యక్షుడు ఉండెల వెంగళరెడ్డి, ఎంపిటిసి

సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

భూమిరెడ్డి కొండారెడ్డి, గుంటగాని భాస్కర్, సర్పంచి పాలగిరి సంపూర్ణ, నాయకులు బాలిరెడ్డి, గుర్రం మాల్యాద్రి, నరసింహారెడ్డి, గహ సారథులు పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** మండల పరిధిలోని అమానిగుడిపాడు, వాదంపల్లి గ్రామాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి పబ్బిశెట్టి మంజుల శ్రీనివాసరావు, జడ్‌పిటిసి చేదూరి విజయ భాస్కర్, వైసిపి మండల అధ్యక్షుడు కొప్పర్తి చిన్న ఓబులురెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **దర్శి :** జగనన్న సురక్ష పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లి, కొర్లమడుగు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రకాల సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి శోభన్‌బాబు, డిటీలు ఎ. రవిశంకర్, దేవప్రసాద్, సర్పంచులు రాము, బత్తుల సుబ్బలక్ష్మి, వెన్నపూస రమణ, ఎంపిటిసి సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు దేవదానం పాల్గొన్నారు. తాళ్ళూరు మండలం దోసకాయలపాడు, లక్కవరం గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లక్కవరం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో తహశీల్దారు ప్రసాదరావు, సర్పంచి వరలక్ష్మి, ఎంపిటిసి వెంకటరమణ, సచివాలయ కన్వీనరు తూము సుబ్బారెడ్డి, కోకన్వీనరు వెంకటేశ్వర్లు, కార్యదర్శి రేణుక పాల్గొన్నారు. దోసకాయలపాడు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇఒఆర్‌డి రాజు, డిటీ ఇమ్మానియేలు, సర్పంచి కోట శివలక్ష్మి, పోశం సుమలత, ఎంపిటిసి గూడా సరస్వతి, కార్యదర్శి శ్రీవల్లి, గ్రామ నాయకులు వెంకటరామిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **కొనకనమిట్ల :** ప్రజల సత్వర పరిష్కారం కోసమే జగనన్న సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గాలిదిన్నె సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అపరిస్కృత సమస్యలను తక్షణమే పరిష్కరించాలనే ఉద్దేశంతో 11 రకాల సర్టిఫికెట్లను లబ్ధిదారులకు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకొని సర్టిఫికెట్లను పొందాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను చేతుల మీదుగా అందజేశారు. మండల పరిధిలోని వాగుమడుగు సచివాలయం వద్ద ఎంపిడిఒ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూరబోయిన మురళీకష్ణ, తహశీల్దారు ప్రసాద్, సచివాలయ మండల కన్వీనర్ ఎస్.పెద్ద వెంకటరెడ్డి, ఇఒఆర్‌డి జనార్ధన్, వెలుగొండ దేవస్థానం ఆలయ మాజీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, విఆర్ఓ కె.రాజశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య,కమలాకర్‌రావు, పాలూరి లక్ష్మీ వెంకటేశ్వర్లు, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, నాయకులు బోరిగర్ల బాలయ్య, సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **శింగరాయకొండ :** శింగరాయకొండ -1 సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి తాటిపర్తి వనజ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు ఉష, ఎంపిటిసి సోమిశెట్టి వాసవీదేవి, ఇఒఆర్‌డి సుధాకర్, ఆర్ఐ తిరుమలరావు, పంచాయ తీ కార్యదర్శి సుబ్రమణ్యం పాల్గొన్నారు. **సిఎస్.పురం :** మండల పరిధిలోని బోయమడుగుల సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మూఢమంచు వెంకటేశ్వర్లు, జడ్‌పిటిసి మేకల శ్రీనివాస్, వైసిపి మండలం కన్వీనర్ బోనగిరి వెంకటయ్య, యూత్ అధ్యక్షుడు అటేలయ్య, సచివాలయం కన్వీనర్ బైరెడ్డి తిరుపతిరెడ్డి, సర్పంచి బోట్ల చిరంజీవి, యుటిసి జిల్లా అధ్యక్షుడు మేకల తిరుపతయ్య, దుగ్గిరెడ్డి జయ, వెంకటేశ్వర్లు, పెరుగు సుబ్బరామయ్య, గహ సారథులు, వైఎస్‌ఆర్సిపి నాయకులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

74 పొగాకు బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

కొండపి వేలం కేంద్రానికి మండల పరిధిలోని జువ్విగుంట, అయ్యవారిపాలెం, తంగెళ్ల, జాళ్లపాలెం, పీరాపురం గ్రామాలకు చెందిన రైతులు 994 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 920 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 74 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.రూ.245, అత్యల్ప ధర రూ.150, సరాసరి ధర రూ.235.67 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాదికారి ఎస్.రామారావు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి- కంభం రూరర్

మండల పరిధిలోని ఎల్.కోట ప్రాథమిక పాఠ శాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఉద్యోగోన్నతి పొందిన నాగేశ్వరరెడ్డి , బదిలీ పై వెళ్లిన సుహాసిని, కోటేశ్వరయ్యను పాఠశాల ప్రధానో పాధ్యాయుడు వేణు గోపాలచారి, ఉపాధ్యాయుడు కష్ణరంగారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సన్మా నించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, ఉన్నత పాఠశాల ప్రధా నోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు , హజరత్ గూడెం ఎంపి యు పి ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సరోజ, విద్యార్థుళ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోనినల్లమల అటవీ ప్రాంతంలో గంజివారిపల్లి ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జ్వరాలతో బాధ పడుతున్న 70 మంది నుంచి రక్తపూతలు తీశారు. సాధారణ వ్యాధులతో బాధ పడుతున్న వారికి మందులు అందజేశారు. రక్తహీనతతో బాధ పడుతున్న రోగులకు ఐరన్ మాత్రలు, టానిక్‌లు, ప్రొటిన్ పౌడర్లు పంపిణీ చేశారు. గర్భిణీలు, చిన్నారులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాషా, సుజాత, జ్యోతిరాణి, జానారెడ్డి, శ్రీనివాసరావు, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, విజయభాస్కర్, కొండయ్య పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో గంగవరం రోడ్డులో తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపానికి స్థలాన్ని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ సహకారంతో కళ్యాణ మండపానికి స్థలం కేటాయించారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి గుమ్మా పద్మజ యల్లేష్ అధ్యక్షతన మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ విజయ తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతి నిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

పుస్తకాలు అందజేస్తున్న సరోజ సేవా ఫౌండేషన్ సభ్యులు

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

సరోజ సేవా ఫౌండేషన్ ఆసరా టంగుటూరి వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాకల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్లస్ విద్యార్థినులకు సోమవారం పుస్తకాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డివిఎస్.ప్రసాద్, ఫౌండేషన్ అధ్యక్షుడు చిడిపోతు వెంకటేశ్వర్లు, ఫౌండేషన్ సభ్యులు ఎన్. బాలసుబ్రమణ్యం, ఉన్నం వెంకటసుబ్బయ్య, ఆర్.శివ, నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్పందనలో అర్జీ అందజేస్తున్న బడుగు వెంకటేశ్వర్లు

బినామీ పట్టాలు రద్దు చేయాలి

హనుమంతునిపాడు : మండల పరిధిలోని హాజీపురం, మిట్టపాలెం, సీతారాంపురం, ముప్పలపాడు, మప ామందాపురం గ్రామాల్లో ఆర్‌సిబి 834 ప్రకారం 2002లో కొంత మంది నాయకుల పేరుతో బినామీ పట్టాలను సష్టించినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన నిరుపేదలైన కుటుంబాలకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ మేరకు సోమవారం కనిగిరిలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాలలో లేని వ్యక్తుల పేర్లతో 54 మందికి 211 ఎకరాలకు అక్రమంగా పాస్ పుస్తకాలు పుట్టించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారుల దష్టికి తీసుకు పోయినట్లు తెలిపారు. అక్రమ పట్టాలు, పాస్ పుస్తకాలు రద్దు చేయాలని ప్రజాఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. అయిన ప్పటికీప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఈ విషయంపై విచారణ జరిపి బినామీ పట్టాలను రద్దు చేయాలని ఆయన కోరారు.

రాష్ట్రంలో అరాచక పాలన

జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మాట్లాడుతున్న రాయపాటి అరుణ

రాష్ట్రంలో వైసిపి అరాచన పాలన సాగుతోందని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ తెలిపారు. జనసేన సైనికులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అరుణ జండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ పెద్ద కొత్తపల్లి, అంజయ్య నగర్, నర్సాయపాలెం, మారెళ్ళ గుంటపాలెం మీదుగా లింగంగుంట వరకూ సాగింది. ఈ సందర్భంగా రాయపాటి అరుణ మాట్లాడుతూ వైసిపి పాలనలో అన్యాయం, అక్రమాలు, దౌర్జన్యాలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నట్లు తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు నున్నా బాలసుబ్రమణ్యం, చీమకుర్తి మండల నాయకులు దరిమడుగు నాగరాజు, తోట సుధాకర్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఏర్పాటు ప్రస్తుత క్రియాశీలక రాజకీయాల్లో పనితీరు రాబోయే కాలంలో చేయబోయే అభివద్ధి పనుల గురించి వివరించారు. అనంతరం జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, మండల అధ్యక్షులు, నున్న బాల సుబ్రమణ్యంను శాలువాతో గ్రామ కమిటీ సభ్యులు సన్మానించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా భావన వినోద్, ప్రధాన కార్యదర్శిగా మెడబలిని వెంకటేశ్వర్లు, గ్రామ కమిటీ సభ్యులుగా నంది సతీష్, గుంటూరు అనిల్, తలారి శివ, పెనుమతు ప్రదీప్, బొక్క ప్రభుదేవా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దమ్ము సురేష్, సింగరాజు మధుమని రాజా, మండల ఉపాధ్యక్షుడు తిరుమల శెట్టి చిరంజీవి, జనసేన పార్టీ క్రియాశీలక కమిటీ సభ్యులు గుండా బత్తుల సోమశేఖర్, నారాయణ వంశీ కిరణ్, వెంకటేశ్వర్లు, కొఠారి శివశంకర్ వరప్రసాద్, పొన్నం అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

కోన ప్రభాకర్‌రావు విగ్రహాన్ని పెట్టి తీరుతా

ప్రజాశక్తి-బాపట్ల

ఎవరు వద్దన్నా.. ఎవరు కాదన్నా.. ఎందరు అడ్డుపడినా చీలు రోడ్డు సెంటర్‌కు కోన ప్రభాకర్‌రావు విగ్రహం ఏర్పాటు చేసి కోన ప్రభాకరరావు సర్కిల్‌గా నామకరణం చేసి తీరుతామని బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ఘాటుగా వ్యాఖ్యానించారు. సోమవారం దివంగత కోన ప్రభాకరరావు 107వ జయంతి సందర్భంగా బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో కోన ప్రభాకర్‌రావు విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం ఎమ్మెల్యే కోన మాట్లాడారు. 21 యేళ్ల రాజకీయ జీవితంలో నాకు భయమంటే తెలియదు. మరొక్కసారి కోన గెలుపు బాపట్లకు చాలా అవసరం. మొక్కుకునేవారు రెండు కొబ్బరికాయలు కొట్టండి. ఒకటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కోసం, రెండు బాపట్లలో రఘుపతి గెలవాలని అన్నారు. ఏదైనా సమస్య ఎదురైనప్పుడు ఏనాడూ వెనకడుగు వేయలేదని విగ్రహ రాజకీయాలపై ఘాటుగా స్పందించారు. మాజీ గవర్నర్, బహుముఖ ప్రజ్ఞాశాలి కోన ప్రభాకర్‌రావు విగ్రహ రాజకీయాల కోసం చిల్లర రాజకీయ చేష్టలు చేస్తున్న వారిపై నిప్పులు చెరిగారు.

కోన ప్రభాకరరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు కోన రఘుపతి

నేను నా వెనక నా కులం ఉందని అదిరిపడే వాడిని కాదు. డబ్బుందని ఎగసిపడేవాడిని కాదు. బాపట్ల జిల్లా చేసుకోవాలని ఉద్దేశంతో రాజకీయాల్లోకి వచ్చాను. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దయవలన బాపట్ల జిల్లా అయింది. అన్ని జిల్లా కేంద్రాల కంటే మిన్నగా బాపట్లని అభివృద్ధి చేయాలని ఎంతో కష్టపడుతున్నా. రహదారుల మధ్యలో ఉన్న విగ్రహాలను తొలగించకుండా ఒక అద్భుతమైన సర్కిల్‌గా మాత్రమే ఏర్పాటు చేస్తున్నాం. 2014లో 6వేల ఓట్ల మెజార్టీతో గెలిచాను. 2019లో బాపట్ల నియోజకవర్గ ప్రజలు 16 వేల ఓట్ల మెజార్టీతో నన్ను గెలిపించారు. ఎక్కడ ఏది పెట్టాలో మిమ్మల్ని అడిగి చేయాలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బాపట్లకు ఏది మంచో.. ఏది చెడు నాకు బాగా తెలుసు' అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ముఖ్యమంత్రి ఏ విధంగా పాటుపడుతున్నారో, బాపట్ల ప్రయోజనాల కోసం, అభివృద్ధి కోసం ఆయన సారథ్యంలో నేను అంతగానే పాటుపడుతున్నాను. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో జోగి రాజా, చేజర్ల నారాయణరెడ్డి, అవినాష్ నాయుడు, మాల్యాద్రి, జాలిరెడ్డి, చల్లా రామయ్య పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-కర్లపాలెం

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో కష్టపడి పని చేస్తున్నారని, ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. సోమవారం కర్లపాలెం మండలం సమ్మెటవారిపాలెం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అర్హత ఉండి పొరపాటున ఎక్కడైనా మిగిలిపోయిన అర్హులను కూడా తలుపుతట్టి మరీ మంచిచేసే కార్యక్రమమే జగనన్న సురక్ష అని మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టు నాగాంజనేయరెడ్డి, ఏఎంసి ఛైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, జడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సమ్మెట వెంకటేశ్వరరెడ్డి, తహశీల్దార్ జి కేశవనారాయణ, ఈఓపిఆర్‌డి ఎలీషాబాబు తదితరులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: ప్రజల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా, ప్రతి సచివాలయంలో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర శాప్ నెట్ ఛైర్మన్, వైసిపి అద్దంకి ఇన్‌చార్జి, బాచిన కృష్ణ చైతన్య తెలిపారు. సోమవారం మండలంలోని మామిళ్లపల్లి, మిన్నేకల్లు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ ఆయా గ్రామాల సచివాలయ పరిధిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమానికి విశేష ఆదరణ లభిస్తా ఉందన్నారు. ప్రజల సమస్యలను వెనువెంటనే పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో వైసీపీ ప్రభుత్వం ముందుకు సాగుతుందని చైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అడవి శ్రీనివాసరావు, వైసిపి మండల కన్వీనర్ చింతా రామారావు, తహశీల్దార్ టీ ప్రశాంతి, ఎంపీడీవో జీ లక్ష్మీదేవి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కారంచేడు: బాపట్ల జిల్లా కారంచేడు మండలం కుంకులమర్రు-2 సచివాలయం, స్వర్ణ గ్రామ సచివాలయాల పరిధిలో సోమవారం నాడు జరగిన జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్వర్ణ గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒక వెయ్యి 988 మంది లబ్ధిదారులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు రైస్ కార్డులు లాంటి వివిధ రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేసి బాపట్ల జిల్లాలోని అత్యధిక సర్టిఫికెట్ల పంపిణీ చేసిన గ్రామంగా నిలిచింది. అనంతరం కుంకలమర్రు గ్రామపంచాయతీలో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కృష్ణమోహన్ పాల్గొని వివిధ రకాల అభివృద్ధి పనులను పరిశీలించి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ముందుగా కుంకలమర్రు గ్రామంలోని గాంధీనగర్ చెరువును పరిశీలించి కుంకలమర్రు గ్రామస్తులకు వాకింగ్, పిల్లలకు చిల్డ్రన్ పార్క్‌ను ఏర్పాటు చేయమని అధికారులను కోరారు. అనంతరం కుంకలమర్రు గ్రామంలోని గ్రామ సరిహద్దును అనుకొని, దక్షిణ పొలానికి ఆనుకొని ఉన్న డ్రైనేజీ కాలువ పునరుద్ధరీకరణకు మన పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ కుంకలమర్రు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంలో ఆమోదించిన డ్రైనేజీ పైప్‌లైన్ వర్క్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సదరు అధికారులను ఆదేశించారు. స్వర్ణ పంచాయతీలో జరిగిన కార్యక్రమంలో స్వర్ణ సర్పంచి మధుబాబు, తహశీల్దారు ఎస్ వెంకటరత్నం, మండల ప్రత్యేక అధికారి రామారావు, ఈఓఆర్‌డి ఆర్ రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు పాల్గొనగా కుంకలమర్రు సచివాలయం-2లో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జితో పాటు ఏఎంసి ఛైర్మన్ జువ్వ శివరాం ప్రసాద్, ఎంపీడీవో విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ సూదనగుంట సతీష్‌చంద్ర, కార్యదర్శి కే అంజయ్య, గ్రామ సర్పంచి, ప్రజలు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పర్చూరు: ప్రజలకు నిత్యం అవసరమైన సర్టిఫికెట్లను ఏ మాత్రం ఆలస్యం లేకుండా వెనువెంటనే అందిస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం దేశంలోనే నూతన ఒరవడిని సృష్టించిందని పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ ప్రజలకు ముఖ్య అవసరమైన సర్టిఫికెట్లను శ్రమ లేకుండానే అక్కడికక్కడే ఇవ్వటంతో వారి అవసరాలు వెంటనే పరిష్కారమవుతున్నాయన్నారు. అనంతరం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ జువ్వా శివరాం, సర్పంచ్ మల్లా అంజమ్మ, జెఏసి కన్వీనర్ ముప్పాళ్ల రాఘవయ్య, మాజీ ఎంపిపి కోట హరిబాబు, మండల కన్వీనర్ కఠారి అప్పారావు, మల్లా శ్రీనివాసరావు, గాదె సురేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పర్చూరు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమంచి మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కోవిడ్ సమయంలో ప్రజలకు విశేష సేవలందించింది వాలంటీర్లు అని గుర్తు చేశారు. చంద్రబాబు నాయుడు పంపిన స్క్రిప్టును పవన్ కళ్యాణ్ పొల్లు పోకుండా చదివారని ఆమంచి కృష్ణమోహన్ ఆరోపించారు. సమావేశంలో కారంచేడు ఎంపిపి నీరుకట్టు వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ రూరల్: సంక్షేమ పథకాల సృష్టికర్తగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కీర్తించబడుతున్నాడని శాప్ నెట్ ఛైర్మన్ అద్దంకి నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎస్ఎల్ గుడిపాడు కొమ్మినేనివారిపాలెం గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని పలువురి లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్నికల హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చిన ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డి చరిత్ర పుటలలో నిలిచిపోతారని అన్నారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారంలో భాగం కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తూ, పార్టీలకు అతీతంగా కొన్ని లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనాపాటిగా చరిత్రలో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా రైతు అధ్యక్షులు సంతమాగులూరు మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ చింతల పేరయ్య, గ్రామ సర్పంచి పసల అంజలి నాగేశ్వరరావు, కొమ్మినేనివారిపాలెం సొసైటీ అధ్యక్షులు దరిశి రామకృష్ణయ్య, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువలీ, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జ్, టి నరేష్ సర్పంచులు ధూళిపాళ్ల బుల్లిరామయ్య, బండారు వెంకాయమ్మ గురవయ్య, మేడ జయలక్ష్మి, నాయకులు పూరేటి వెంకటనారాయణ, మెడ శివదుర్గ, వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: పట్టణంలోని రాంనగర్ -2 సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాప్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ వైసిపి నియోజకవర్గ అద్దంకి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందించడంలో ముందుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ కొమ్మాలపాటి సుధీర్, అధికారులు, పట్టణ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌లు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి, వార్డు కౌన్సిలర్స్, వార్డు ఇన్‌ఛార్జిలు, సచివాలయం కన్వీనర్లు, వివిధ హెూదాలలో ఉన్న వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకిలో ప్రజలకు సర్టిఫికెట్లను అందిస్తున్న బాచిన కృష్ణ చైతన్య

దాసరిపాలెంలో క్రికెట్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని గోరిగపూడి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెం గ్రామ యువతకు గ్రేస్ ఫౌండేషన్ అధినేత కైతేపల్లి షాలేంరాజు రూ.25 వేల విలువైన క్రికెట్ కిట్లను సోమవారం అందజేశారు. ఇటీవల గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న షాలేం రాజును యువత క్రికెట్ కిట్లు అందజేయాలని కోరటంతో వాటిని ఈ రోజు అందించామని, క్రీడల్లో యువత రాణించాలని షాలేం రాజు కోరారు. కులమతాలకు అతీతంగా నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు షాలేంరాజు తెలిపారు. ఉచిత వైద్య శిబిరాలు ద్వారా కూడా పేద, మధ్య తరగతి ప్రజలకు తోడుగా ఉంటున్నామని అన్నారు. తొలుత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రచార కమిటీ కన్వీనర్ యాన్నం సురేష్, గుత్తా గోపి, పమిడిముక్కల సాయి, వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు దోనేపూడిలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి-కొల్లూరు

మండల పరిధిలోని క్రాప, దోనేపూడి గ్రామాలలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఐ సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు వివిధ రకాల సంక్షేమ పథకాలు అందిస్తోందని, వాటికి అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లు గతంలో పొందిన వారిని గుర్తించి వెంటనే అందిస్తామని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఎం రాము, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాజ కుమారి ఉన్నారు.

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పాటు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పాటు ఉంటుందని బాపట్ల కలెక్టర్ పి.రంజిత్ బాషా భరోసా ఇచ్చారు. సోమవారం నూతనంగా ఎంపికైన ఏపిఆర్ఎస్ఏ బాపట్ల జిల్లా కమిటీ నాయకులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీకి ఎంపికైన జిల్లా నాయకులందరినీ పరిచయం చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సిహెచ్ సురేష్‌బాబు గౌరవ జిల్లా కలెక్టర్‌ను జిల్లా కలెక్టరేట్ ఆవరణలో పనిచేస్తున్న సిబ్బంది భోజనం, టిఫిన్, టీ వంటి కనీస అవసరాల కోసం సుమారు 2 కిలోమీటర్లు దూరం వెళ్లవలసివస్తోందని, ఇది చాలా ఇబ్బందిగా ఉందని, కాబట్టి ఉద్యోగుల సౌకర్యార్థం ఏదైనా క్యాంటీన్ ఏర్పాటు చేయించాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఏపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ సభ్యుల సంక్షేమం కోసం జిల్లా, డివిజన్ తదితర సమావేశాలు, ఇతర కార్యకలాపాల కోసం ఏదైనా భవనాన్ని కేటాయించాలని కోరగా గౌరవ జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా సానుకూలంగా స్పందించి అవకాశం ఉన్నంత మేరకు త్వరలోనే ఉద్యోగుల కోసం క్యాంటీన్, ప్రత్యేక గ్రీవెన్స్, సంఘం భవనం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి ఓంకార్, జిల్లా ఉపాధ్యక్షుడు కె నెహ్రూబాబు, బి వెంకటేశ్వర్లు, ఆర్ వాసుదేవరావు, సహాధ్యక్షులు బి సుశీల, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎం సత్యనారాయణ, జిల్లా కోశాధికారి కె శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు యు శ్రీనివాసరావు, పెరుగు శ్రీనివాసరావు, విజయ్ కుమార్, బి కనకదుర్గ తదితరులు హాజరయ్యారు.

స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించాలి

ఆర్‌డిఓ జగన్నాథం పార్థసారథి

ప్రజాశక్తి-రేపల్లె

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి జగన్నాథం పార్థసారథి అధికారులను ఆదేశించారు. సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 7 అర్జీలు అందాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన ప్రజా సమస్యలను పరిష్కరించే గొప్ప వేదిక అన్నారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు వెంటనే పంపిస్తామని తెలిపారు. అధికారులు చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలి

డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల చేయాలి,అభ్యర్థులు వయోపరిమితి 47 సంవత్సరాలకు పెంచాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) ప్రకాశం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్పందన సమావేశ మందిరంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్‌కి అర్జీ ఇచ్చారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె ఎఫ్ బాబు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పోస్టులు ఎక్కువగా ఉన్నాయని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయకుండానే కాలయాపన చేయడం సరైంది కాదన్నారు. నిరుద్యోగులు ఎదురుచూస్తున్న పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి వై.దానియేలు, వీరాస్వామి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్‌కి అర్జీ డివైఎఫ్ఐ నేతలు

వెంకటేశ్వర్లు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కొండ్రగుంట వెంకటేశ్వర్లుకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సిఐటియు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండ్రగుంట వెంకటేశ్వర్లుకి ఇరిగేషన్ ఉద్యోగులు ఘన నివాళులర్పించారు. స్థానిక శ్రీగిరి కొండపై అసోసియేషన్ కార్యాలయంలో కొండ్రగుంట వెంకటేశ్వర్లు 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఇరిగేషన్ వర్క్‌ఛార్జ్ ఉద్యోగులు, రిటైర్మెంట్ ఉద్యోగులు పూలమాలలు వేసి.. నివాళు లర్పించారు. కార్యక్రమానికి కె.రామమోహన రావు అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లా డుతూ కొండ్రగుంట వెంకటేశ్వర్లు రాష్ట్రంలోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేసి వారి కార్మికుల మన్ననలు పొందారన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, నాయకులు కె.వీర రాఘవస్వామి, కె.రవి డి. శ్రీనివాసులు, జె.వి.కష్టారావు, శ్రీనివాసరావు, బివి శేషయ్య, ఎస్‌కె ముర్తుజా వలీ పాల్గొన్నారు.

సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-కనిగిరి

దూరప్రాంతాల నుంచి జిల్లాకేంద్రంలో సమస్యల పరిష్కారం కోసం అర్జీలను సమర్పిం చేందుకు వస్తున్న వారిని గమనించి స్థానికంగా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమం కనిగిరిలో ఏర్పాటు చేశామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలియజేశారు. సోమవారం కనిగిరి పవిత్ర ఫంక్షన్‌హాలులో ఏర్పాటుచేసిన ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొని.. అర్జీలను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి సంభందిత అధికారు లను ఆదేశించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. 440 అర్జీలు వచ్చాయన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహిం చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బుర్రా మధు సూదన్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, జిల్లాస్థాయి, నియోజకవర్గ స్థాయి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

హెల్మెట్ ధరించకపోతే వాహనం సీజ్

రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సుప్రీం కోర్టు, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించకుండా, సీట్ బెల్ట్ లేకుండా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే వాహనాలు సీజ్ చేస్తామని రవాణా శాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ఓ ప్రకటనలో తెలిపారు. సరియైన పత్రములు లేకుండా వాహనములు నడిపై వారిపై మోటార్ వాహన తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేయటం, వాహనములు సీజ్ చేస్తామన్నారు. మోటార్ సైకిల్, కారు వాహన యజమానులు, వాహన చోదకులు రహదారి భద్రతా నియమావళిని తప్పక పాటించవలసినదిగా జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గురుకుల పాఠశాలలో మంత్రి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలను సోమవారం రాత్రి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతి నుంచి విజయవాడకు వెళుతూ గురుకుల పాఠశాలకు వెళ్లి.. విద్యార్థులతో కలిసి భోజనం చేసి.. అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు భోజన వసతి బాగుందని చెప్పారు. అనంతరం మంత్రి నాగార్జున విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో సైన్స్ గ్రూపులు లేవని తమ దృష్టికి వచ్చిందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత శింగరాయకొండ గురుకుల పాఠశాలలో సైన్స్ గ్రూపులు ఏర్పాటు చేస్తామన్నారు. పవన్‌కళ్యాణ్ వాలంటీర్లపై వ్యాఖ్యలను తాను ఖండిస్తున్నానన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల ప్రజల్లో సినిమా నటుడిగా ఇమేజ్ పోతుందని వ్యాఖ్యానించారు.

సిఎం ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే..

తగిన మూల్యం తప్పదు..

- సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్
- కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల 36 గంటల నిరసన

ఒంగోలులో మాట్లాడుతున్న పి.అజయ్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని, డిమాండ్లు నెరవేర్చాలని ఒంగోలు కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 36 గంటల నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తొమ్మిదేళ్ల కాలంలో ఐసిడిఎస్ పథకానికి బడ్జెట్‌లో కోత పెడుతుందని, వేదాంత ప్రథమ వంటి స్వచ్ఛంద సంస్థలకు అంగన్వాడీ సెంటర్ల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించిందన్నారు. ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసిందని, ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా 2020 కొత్త విద్యా విధానం తీసుకొచ్చిందన్నారు. ఇందుకు వత్తాసుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయాలన్నారు. లబ్ధిదారుల లిస్టులు తగ్గించడానికి పోషణ ట్రాకర్ యాప్‌లు తీసుకొచ్చిందని, దీనికి ఆధార్ లింక్ చేశారన్నారు. దాదాపు 30 శాతం చిన్నపిల్లలకి ఆధార్ కార్డులు లేవని, ఆధార్ కార్డులు తీసుకురావాలని అంగన్‌వాడీలపై ఒత్తిడి పెంచారన్నారు. ఎటువంటి ట్రైనింగ్ లేకుండానే ఆన్‌లైన్ పని ప్రారంభించారని, ఫోన్లు పని చేయకపోవడం, సిగ్నల్స్ లేకపోవడంతో మానసిక ఒత్తిడితో అంగన్‌వాడీలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాటాన్ని కొనసాగించాలని సూచించారు. అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.కల్పన మాట్లాడుతూ తెలంగాణ కన్నా వెయ్యి రూపాయలు వేతనం పెంచుతామన్న ముఖ్యమంత్రి హామీ నీటిపై రాత గానే మిగిలిపోయిందన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి అంగన్‌వాడీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలన్నారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ టంగుటూరు మండలం రావివారిపాలెం అంగన్వాడీ టీచర్ హనుమాయమ్మ డ్యూటీలో ఉండగా హత్యకు గురైనా ఇప్పటివరకు ఎక్స్ గ్రేషియా ప్రకటించలేదన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, కనీసం మట్టి ఖర్చులు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాలం సుబ్బారావు, యం.రమేష్, జిల్లాలోని 14 ప్రాజెక్టుల నాయకులు కె.వి.సుబ్బమ్మ, యం.ధనలక్ష్మి, సుజాత, ప్రశాంతి, రాధమ్మ అచ్చమాంబ, సిఐటి జిల్లానాయకులు జి.శ్రీనివాసులు, డికెఎం రఫీ, టి.మహేష్, టి.రంగారావు, టి.రామ, బి.సుబ్బారావు, పి.ఆంజనేయులు, పి.రూబెన్ పాల్గొన్నారు.

ఒంగోలులో అభ్యుదయ గీతాలు ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

నిరసన స్థలంలోనే నిద్ర

36 గంటల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు అదే స్థలంలో నిద్రకు ఉపక్రమించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం ఉదయం నుంచి నిరసన కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు సాయంత్రం నుంచి ఆటపాటలు నిర్వహించారు. దీంతో కలెక్టరేట్ పరిసరాలు అంగన్‌వాడీల ఆటా, పాటలతో మారుమోగిపోయాయి. రాత్రి 9 గంటల సమయంలో అంగన్‌వాడీలు నిరసన తెలిపిన స్థలంలో నిద్రకు ఉపక్రమించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వై.సత్యవతి, ఉపాధ్యక్షురాలు పి.కల్పన, కోశాధికారి కెవి సుబ్బమ్మ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాలం సుబ్బారావు, యం.రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, నాయకులు జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

బాపట్లలో మహా ధర్నా...

బాపట్ల: బాపట్ల కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు అధికసంఖ్యలో 36 గంటల ధర్నా చేపట్టారు. అంగన్వాడీలతో బాపట్ల పాత బస్టాండ్ సెంటర్ కిక్కిరిసిపోయింది. ధర్నాను భగ్నం చేసేందుకు పోలీసులను పెద్ద ఎత్తున పోలీసులను మోహరించారు. ప్రత్యేక పోలీసు దళాలను వాహనాల్లో బాపట్లకు రప్పించారు. అయినప్పటికీ అంగన్వాడీలు తమ పోరుబాటను కొనసాగించారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వాన్ని ఇంటిదోవ పట్టిస్తామని అంగన్వాడీలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా ప్రధానకార్యదర్శి పి.రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ ఈ ధర్నాలో జిల్లావ్యాప్తంగా రెండు వేలకు మందికి పైగా అంగన్వాడీలు హెల్పర్లు పాల్గొని తమ సత్తా నిరూపించారన్నారు. ఇదే స్ఫూర్తితో అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అంగన్వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందార్ మాట్లాడుతూ అంగన్వాడీలకు ప్రతినెలా జీతాలు ఇవ్వటం లేదన్నారు. వైయస్సార్ పోషణ పథకానికి భోజనం వండటానికి అవసరమైన డబ్బులు లేకపోవడంతో అంగన్వాడీ వర్కర్స్ సొంత డబ్బులు ఖర్చు పెడుతూ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పని భారంతో మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ధర్నాకు మద్దతుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్, ఏపీ ఎన్జీవో అసోసియేషన్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీల న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్ర వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె.నిరంజన్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం పి.మనోజ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కె.శరత్‌బాబు, ఆటో యూనియన్ జిల్లా నాయకులు బుచ్చిరాజు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రమీల, అనిత, బ్యూలా, కామేశ్వరి, కె.రత్నకుమారి, వై.మేరీమణి పాల్గొన్నారు.

బాపట్లలో నిరసన స్థలంలోనే నిద్రిస్తున్న అంగన్‌వాడీలు

అక్కడే నిద్ర

బాపట్లలో అంగన్వాడీల సమస్యలపై 36 గంటల ధర్నాలో కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు ధర్నా ప్రదేశంలోనే సోమవారం రాత్రి నిద్రించారు. అంగన్వాడీ కార్యకర్తలకు సంఘీభావంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి వారితో పాటే బాపట్ల పాత బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన శిబిరంలో నిద్రించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య, జిల్లా పార్టీ కమిటీ సభ్యులు కష్ణమోహన్, మణిలాల్ సంఘీభావం తెలిపారు.

బాపట్లలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న మజుందార్